# బొమ్మలాంతరు

శ్రీ శ్రీ

దిద్దుతూన్న గుంట ఓనమాలు చెరిపేసి
చేతిలో ఉన్న బలపం విరిచేసి
కొత్తపలక కొనుక్కొచ్చాడు కుర్రాడు

పొగాచుట్టుకొంటూన్న రోకలి పారేసి
తెలివితక్కువతనాన్ని గొయ్యితీసి పాతేసి
పొరుగువాడెలా ఉన్నాడని భోగట్టాచేశాడు వెర్రాడు

ఆడుతూన్న నాటకం ఆపేసి
పెట్టుకున్నగడ్డం కుళ్లాయీ లాగేసి
ఆడియన్సులో కలిసిపోయాడు విదూషకుడు

నిన్నటి వాగ్దానాన్ని నేటి ఉపన్యాసంలో కాల్చేసి
నేటి ఫోర్జరీని రేపటి సంతకంగా మార్చేసి
ఇక్కడేవుండు వొస్తానని ఎక్కడికోపోయాడు వినాయకుడు

తనచుట్టూ తాను తిరుగుతూ
సూర్యుడిచుట్టూ పరిభ్రమించే భూమిలాగ
ఆశయంచుట్టూ తిరుగుతోంది ఆవేశం.

(పేకాటలో ఒక చేతిని అన్నీ పొడిముక్కలే అయి ఒక్క బొమ్మా లేకపోవడం
బొమ్మలాంతరు అప్పుడు ఆట కలిపి మళ్లీ ముక్కలు కలపడం ధర్మం.)